

జగిత్యాలలో చిట్ల రమణ-సునీత ఇంట్లో బతుకమ్మను పేర్చుతున్న ఎమ్మెల్సీ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సతీమణి రాధిక, తదితరులు

# జగిత్యాల పూలవనం

- జాగృతి ఆధ్వర్యంలో కనులపండువగా బతుకమ్మ వేడుకలు
- పాల్గొన్న భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు
- జిల్లా కేంద్రంలో శోభాయాత్ర
- ఆడిపాడిన మహిళలు
- మార్మోగిన మినీ స్టేడియం

జగిత్యాల, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): జగిత్యాల పట్టణం పూల సింగిడిగా మారిపోయింది. తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలతో జగిత్యాల నేల పులకించిపోయింది. భారత జాగృతి ఆధ్వర్యంలో, నిజామాబాద్ ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో జగిత్యాల మినీస్టేడియంతో పాటు, పరిసర ప్రాంతాల్లో జరిగిన బతుకమ్మ సంబురం అంబరాన్నంటింది.

## రెండిండ్లలో బతుకమ్మను పేర్చిన ఎమ్మెల్సీ కవిత

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జగిత్యాలకు చేరుకున్న భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్-రాధిక దంపతులు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ స్వాగతం పలికారు. గోవిందుపల్లిలో ప్రతిష్టించిన నవదుర్గ మాత మండపాన్ని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ దంపతులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం 1.30 గంటలకు విద్యానగర్‌లో ఉన్న చిట్ల రమణ-సునీత దంపతుల ఇంటికి చేరుకోగా, కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీకి ఘన స్వాగతం పలికారు. రమణ ఇంట్లో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్ సతీమణి రాధిక, ప్రముఖ సింగర్ తేలు విజయ, జాగృతి జగిత్యాల అధ్యక్షురాలు జమున, మహిళ ప్రజాప్రతినిధులు, విద్యానగర్, బట్టివాటకు చెందిన మహిళలతో కలిసి ఎమ్మెల్సీ కవిత బతుకమ్మను పేర్చారు. బీర ఆకులు తాంబాళంలో పర్చడంతో పేర్చడం ఆరంభించిన ఎమ్మెల్సీ కవిత, ఇద్దరక్క 'చెల్లెండ్లు ఉయ్యాలో'.. 'ఒక్కేసి పువ్వేసి చందమామ'.. 'రామరామ శ్రీరామ' అంటూ బతుకమ్మ పాటలు పాడుతూనే పేర్చడం పూర్తి చేశారు. తర్వాత లాంఛనంగా అక్కడే బతుకమ్మను ఉంచి స్థానిక మహిళలతో ఆడిపాడారు. తర్వాత జంబిగద్దె సమీపంలో డాక్టర్ మోర రోజ సుమన్ దంపతుల ఇంటికి చేరుకోగా, ఆ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. రోజ ఇంట్లోనూ బతుకమ్మను పేర్చారు.

## మార్మోగిన మినీ స్టేడియం

భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో జగిత్యాల మినీ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. అంతకుముందు రాత్రి 7 గంటలకు బతుకమ్మల వేడుక జంబిగద్దె సమీపంలో ప్రారంభమైంది. మోర రోజ ఇంట్లో పేర్చిన బతుకమ్మతో ఎమ్మెల్సీ కవిత, పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు బతుకమ్మలతో జంబిగద్దె వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్సీ కవితతోపాటు ఎమ్మెల్యే సంజయ్ సతీమణి రాధిక, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, యువతులు బతుకమ్మ ఆడిపాడారు. సాయంత్రం 7 గంటలకు జంబిగద్దె వద్ద నుంచి ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని శోభాయాత్రగా స్టేడియానికి చేరుకున్నారు. మినీస్టేడియంలో భారీ సైజులో రూపొందించిన బతుకమ్మలను ఉంచి పలు బృందాలుగా విడిపోయి బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్సీ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బతుకమ్మ ఆడుతున్న ప్రతి బృందం వద్దకు వెళ్లి వారితో కలిసి ఆడారు. ప్రముఖ నేపథ్యగాయకులు తేలు విజయ, పద్మావతి బతుకమ్మ పాటలు పాడి ఉర్రూతలూగించారు. మహిళల ఉత్సాహం చూసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ సైతం వారితో కాసేపు సరదాగా నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. రాత్రి తొమ్మిది గంటల వరకు మహిళలు, బతుకమ్మల ముందు తమ ఆట పాటలను ప్రదర్శించి అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కాగా మినీస్టేడియంలో బతుకమ్మలు ఆడే మహిళల కోసం అన్ని ఏర్పాట్లను భారత జాగృతి సంస్థ ఘనంగా ఏర్పాటు చేసింది.



జగిత్యాలలో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న చిట్ల రమణ-సునీత దంపతులు



బతుకమ్మ సంబురాల్లో ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన



మోర రోజ ఇంట్లో బతుకమ్మ పేరుస్తున్న ఎమ్మెల్సీ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మోర రోజ, రాయికల్ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, తదితరులు



బతుకమ్మ ఎత్తుకొని శోభాయాత్రగా వెళ్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

# బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల్లో వణుకు

■ వచ్చే ఎన్నికల్లో విజయం మనదే ■ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ■ బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు



బోర్నపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబర్ 17: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్షాల్లో వణుకు మొదలైందని, ఏం మాట్లాడాలో తెలియక ఆగమైపోతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. రాయికల్ మండలం బోర్నపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు దంటిక రాజేశం, పొన్నం నరేశ్, వెంగల రాజు, వారి అనుచరులు 20 మంది మంగళవారం జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రజల సంక్షేమ మ్యానిఫెస్టో అని, కేసీఆర్ బీమా పథకంతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. రూ.400కే సిలిండర్, రైతుబంధు పెంపు పథకాలు చారిత్రాత్మకమన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరూ సీఎం కేసీఆర్ పక్షాన నిలిచి విజయం దిశగా కృషి చేయాలన్నారు. బోర్నపల్లి గ్రామాభివృద్ధికి పెద్దపీట వేశామని, ప్రజల చిరకాల వంతెన కల నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని కొనియాడారు. గ్రామానికి ఇప్పటివరకు రూ.7 కోట్ల నిధులు వ్యయం చేసినట్లు చెప్పారు. ఆసరా పింఛన్ల ద్వారా 68 మందికి ప్ర తి నెలా రూ.1.50లక్షల చొప్పున, ఇప్పటివరకు రూ.కోటి సాయం ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. గ్రామంలో 15 మందికి కల్యాణలక్ష్మి సాయం చేశామని, రైతుబంధు కింద ఇప్పటివరకు రూ.90 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. 21 మంది గొల్ల కుర్మలకు సబ్సిడీ గొర్రెలను అందజేసి కులవృత్తులను అండ గా నిలిచామన్నారు. ఇక్కడ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ పాదం లత రాజు, ఎంపీటీసీ కవిత శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు రవీందర్, నాయకులు స్వామి, మాజీ సర్పంచ్ గంగారాం ఉన్నారు.

# అభ్యర్థి ఎన్నికల ఖర్చు @ ₹40 లక్షలు

- వ్యయ పరిశీలనలో లెక్కింపు బృందాలే కీలకం
- జిల్లా సహకార అధికారి రామానుజాచారి




సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో రామానుజాచారి

కలెక్టరేట్, అక్టోబర్ 17: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే ఒక్కో అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు మాత్రమే అనుమతి ఉండగా, వారి ఖర్చుల వివరాలు వ్యయ పరిశీలకులు కూలంకషంగా పరిశీలించాలని జిల్లా సహకార అధికారి రామానుజాచారి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో మంగళవారం ఎన్నికల వ్యయ పరిశీలనలో పాల్గొనే అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ పర్యవేక్షకులు, అకౌంటింగ్, ఆడిట్ బృందాల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు సంబంధిత సిబ్బంది మెలకువలు, విధానాలు తెలుసుకొని ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకు వ్యయ పరిశీలన పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆడిట్ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి పద్మావతి, నెహ్రూ యువకేంద్రం కో ఆర్డినేటర్ రాంబాబు, డీఈవో జనార్దన్‌రావు, కో ఆపరేటివ్ అధికారి మనోజ్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి నవీన్ పాల్గొన్నారు.